

# మెమోరియల్

మల్లాది వెంకట కృష్ణమూర్తి

సాదాసీదా దుస్తుల్లో వున్న ఓ ముసలావిడ, ఆవిడ భర్త బోస్టన్ నగరంలో రైలు దిగి, హార్వార్డ్ యూనివర్శిటీకి టేక్సీలో చేరుకున్నారు. ఆ యూనివర్శిటీ ప్రెసిడెంట్ ఆఫీసు గదిలోకి వెళ్ళారు వాళ్ళిద్దరూ. పల్లెటూరి దుస్తుల్లో వున్న వాళ్ళిద్దర్నీ చూసి రిసెప్షనిస్ట ఏం కావాలని అడిగింది.

''ప్రెసిడెంట్‌ని కలిసి మాట్లాడాలని వచ్చాం.''

అంత బీదవాళ్ళకి ప్రెసిడెంట్‌తో ఏం పనా? అనుకుంది రిసెప్షనిష్ట్.

''ఆయన బిజీగా వున్నారు.'' చెప్పింది.

''మేం వేచి వుంటాం.'' చెప్పిందా ముసలావిడ.

విసుగేసి వెళ్ళిపోతారని ఓ గంటసేపు వాళ్ళని వెయిట్ చేయించింది రిసెప్షనిస్ట్. అయినా ఎంతో ఓపికగా వాళ్ళు కూర్చున్నారు కాని కదల్లేదు. వాళ్ళకి కలగని విసుగు వాళ్ళని చూసిన రిసెప్షనిస్ట్‌కి కలగడంతో, ఈసారి ప్రెసిడెంట్ పిలిచినప్పుడు లోపలకి వెళ్ళి వాళ్ళ గురించి చెప్పింది.

ఆయన వాళ్ళని చూడటానికి అంగీకరించాడు. ఆయన బయటకి వచ్చి వాళ్ళ దగ్గర ఆగి అడిగాడు.

''ఏం కావాలి మీకు?''

వెంటనే ఆ వృద్ధురాలు చెప్పింది.

''మా కొడుకు ఈ హార్‌వర్డ్ యూనివర్శిటీలోనే చదివాడు. వాడికి ఈ యూనివర్శిటీ అంటే బాగా ఇష్టం. ఏడాది క్రితం ఓ ఏక్సిడెంట్‌లో పోయాడు. నేను, మావారు వాడి గుర్తుగా మీ యూనివర్శిటీ కేంపస్‌లో ఏదైనా ఓ మెమోరియల్‌ని మా ఖర్చుతో ఏర్పాటు చేయాలనుకుని వచ్చాం.''

ప్రెసిడెంట్ వాళ్ళ దుస్తుల వంక చూసి పెదవి విరిచి చెప్పాడు.

''మేడం. మరణించిన ప్రతీ విద్యార్థి గౌరవార్థం మేం విగ్రహాలు పెట్టించడానికి అనుమతిస్తే, ఈ యూనివర్శిటీ కేంపస్ త్వరలోనే ఓ శ్మశానంలా కనిపిస్తుంది.''

''కాదు. విగ్రహం కాదు మా మనసులో వున్నది - వాడి గుర్తుగా ఇక్కడ ఏదైనా ఓ భవంతి కడదామన్నది మా ఆలోచన.''

ప్రెసిడెంట్ ఆమె ముతక దుస్తుల వంక చూసాడు.

''భవంతా? ఓ భవంతి కట్టడానికి ఎంత ఖర్చవుతుందో మీకు తెలీదు. ఇక్కడ మాకున్న భవంతుల ఖరీదెంతో తెలుసా? ఏడున్నర లక్షల డాలర్లు.'' కఠినంగా చెప్పాడు ప్రెసిడెంట్.

కొద్ది క్షణాల పాటు ఆ దంపతులిద్దరూ నిశ్శబ్దంగా వున్నారు. తర్వాత ఆవిడ తన భర్తవైపు తిరిగి చెప్పింది.

''ఓ యూనివర్శిటీ స్థాపించడానికి అయే ఖర్చు అంతే అయితే మనం ఓ యూనివర్శిటీనే ఎందుకు స్థాపించకూడదు?''

భర్త అంగీకారంగా తల ఊపాడు. వాళ్ళ మాటలు విన్న ఆ ప్రెసిడెంట్‌కి ఎంతో ఆశ్చర్యం వేసింది. 'వీళ్ళు పిచ్చివాళ్ళయి వుంటారు' అనుకున్నాడు.

మిస్టర్ అండ్ మిసెస్ స్టాన్‌ఫర్డ్‌లు ఇద్దరూ లేచి బయటకి నడిచారు. కేలిఫోర్నియాలోని పాలోఆల్టోకి వెళ్ళి వాళ్ళు అక్కడ ఓ కొత్త యూనివర్శిటీని ఆరంభించారు. తమని హార్‌వర్డ్ యూనివర్సిటీ లక్ష్యపెట్టకపోవడంతో. వాళ్ళు తమ కొడుకు పేర పెట్టిన ఆ యూనివర్సిటీ ఇప్పటికీ నడుస్తోంది.

అదే ప్రపంచ ప్రఖ్యాతి చెందిన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ!

★

